సాక్షి
కాకినాడ
గురువారం । 4 । జూలై । 2024



అన్నదాన భవనానికి విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి కొప్పిసెట్టి శ్రీనివాసరావు, సత్య శ్రీలక్ష్మి దంపతులు (లక్ష్మీపోలవరం) 1,11,111 విరాళం అందించారు.



రూ.1,00,016 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పెరిచర్ల సుబ్రహ్మణ్యం వర్మ, కుటుంబ సభ్యులు (హైదరాబాద్) రూ.1,00,016 విరాళంగా అందజేశారు.

డెల్టాకు 11,820 క్యూసెక్కులు



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 11,820 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,600 మధ్య డెల్టాకు 2,220 పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రహదారుల వెంట పచ్చదనం
– కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని రాజమహేంద్రవరం నగరం మీదుగా వెళ్లే జాతీయ రహదారులకు ఇరువైపులా గ్రీనరీ అభివృద్ధిని చేసే విధంగా నేషనల్ హైవే అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులతో ఆమె రహదారుల అభివృద్ధి, పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరంలో జాతీయ రహదారులు ఎన్.హెచ్-16, ఎన్.హెచ్-216 ప్రారంభం నుంచి చివరి వరకు రహదారులకు ఇరువైపులా ఆహ్లాదాన్ని కలిగించే పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా సరిహద్దులు తెలియజేసే విధంగా బోర్డులు పెట్టాలని సూచించారు. మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అన్నారు. ఆగస్టు చివరి నాటికి వంతెనపై ట్రాఫిక్‌ను అనుమతించే విధంగా సిద్ధం చేయనున్నట్టు వివరించారు. రాజానగరం ప్రాంతంలో ఏడీబీ రోడ్డు పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ డి.సురేంద్రనాథ్ వివరిస్తూ జాతీయ రహదారులకు సంబంధించి లాలాచెరువు, ఐటీసీ జంక్షన్, బొమ్మూరు, వేమగిరిలలో ఫ్లైఓవర్ నిర్మాణం, సర్వీస్ రోడ్స్, లైటింగ్‌రే సంబంధించి రూ.345 కోట్లు ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించామన్నారు. గామన్ జంక్షన్ నుంచి దివాన్‌చెరువు వరకు 2.4 కి.మీ. ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం రూ.141 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలను సమర్పించగా, ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభించనున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్ అండ్‌బీ జిల్లా అధికారి ఎస్‌బీవీ రెడ్డి, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. సురేంద్ర బాబు, ఆర్డీబీ ఈఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయం పనుల పరిశీలన



అర్చకులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయాన్ని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు బుధవారం సందర్శించారు. ఆ శాఖ సౌత్ రీజినల్ డైరెక్టర్ నవరత్నకుమార్ పాఠక్ ఆధ్వర్యంలో విచ్చేసిన అధికారులు దేవాలయంలో జరుగుతున్న జీర్ణోద్ధారణ పనులను పరిశీలించారు. మూలవిరాట్ శివలింగాన్ని మొదటి, రెండవ అంతస్తులలో పరిశీలించిన అనంతరం ఆలయ అర్చకులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రాచీన దేవాలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, మూల విరాట్ శివలింగానికి అభిషేకాలు నిలిపివేయాలని సూచించారు. భక్తుల అభీష్టం మేరకు అభిషేకాలు అవసరమనుకుంటే ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆలయంలో వైర్లు, సీసీ కెమేరాలు ఏర్పాటు అస్తవ్యస్తంగా ఉందని వాటిని తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ సూపరింటెండెంట్ గోపీనాథ్ జీనా, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ దేవేంద్రనాథ్ బోయ్, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఏబీపీ వర్మ, సీఏ కేవీవీ ఎస్ఎన్ మూర్తి, హార్టికల్చరల్ సూపరింటెండెంట్ ట్ మహోత్, ఫోర్‌మేన్ పీవీ రమణ, భీమేశ్వరాలయ సీనియర్ అసిస్టెంట్లు మొల్లేటి శ్రీనివాస్, సూరపురెడ్డి వెంకన్నబాబు పాల్గొన్నారు.

మాజీ సైనికులు వెబ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

అమలాపురం టౌన్: మాజీ సైనికులు గుర్తింపు కార్డులు పొందడంతో పాటు వెబ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.కృష్ణారావు అన్నారు. స్థానిక మున్సిపల్ సర్క్యులర్ బజార్‌లోని మాజీ సైనికుల సంఘ కార్యాలయంలో మాజీ సైనికులకు కల్పిస్తున్న అవకాశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణారావు మాట్లాడుతూ మాజీ సైనికులు, వారి డిపెండెంట్‌లకు అవసరమైన గుర్తింపు కార్డులు ఎలా పొందాలి, సైనిక్ వెల్ఫేర్ వెబ్ పోర్టల్‌లో ఎలా నమోదు చేసుకోవాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇప్పటికే మాజీ సైనికులకు, ఆ కుటుంబాల్లోని వితంతువులకు గుర్తింపు కార్డులు జారీ చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సైనిక్ వెల్ఫేర్ వెబ్ పోర్టర్‌లో వివరాలు నమోదు చేసుకోవడం వల్ల సంక్షేమ పథకాలతో పాటు వారి సమస్యలు కూడా పరిష్కరిస్తారని వివరించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులకు గుర్తింపు కార్డులను అందజేశారు. మాజీ సైనికుల సంఘం ఉపాధ్యక్షుడు దొంగ నరసింహమూర్తి, వారెంట్ ఆఫీసర్ రాంబాబు, కంకటాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అడుగంటిన నది



వర్షాల కారణంగా పంపాలోకి కొద్దిగా చేరిన నీరు

- పంపా ఆయకట్టులో ఈ ఏడాది ఖరీఫ్ అయినా సాగయ్యేనా?
- గత ఐదేళ్లలో ఖరీఫ్, రబీ రెండు పంటలూ సాగు
- ఇటీవల కురిసిన వర్షాలకు కొద్దిగా చేరిన నీరు
- ప్రస్తుతం 86.8 అడుగులకు చేరిన నీటిమట్టం
- రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 105 అడుగులు
- ఏటా 12 వేల ఎకరాల సాగు

అన్నవరం: గత ఐదేళ్లు నిరాటంకంగా ఖరీఫ్, రబీ సాగయిన పంపా ఆయకట్టులో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితి నెలకొంది. దీంతో ఈ ఏడాది ఏ ఇబ్బందీ లేకుండా ఖరీఫ్ అయినా సాగవుతుందా అనే పరిస్థితి నెలకొంది. ఇందుకు ప్రధాన కారణం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పంపా రిజర్వాయర్‌లో తగినంత నీరు లేకపోవడమే. గత ఐదేళ్లలో ఏటా జూలై నెల ప్రారంభ సమయానికి 95 అడుగుల నీటి మట్టంతో కళకళ లాడే అన్నవరంలోని 'పంపా' రిజర్వాయర్ ఈ ఏడాది మాత్రం అడుగంటిన నీటితో దర్శనమిస్తోంది. ఆశించిన మేర వర్షాలు లేకపోవడమే దీనికి కారణం. పంపా రిజర్వాయర్ నీటిమట్టం ప్రస్తుతం 86.8 అడుగుల వద్ద ఉంది అంటే డెడ్ స్టోరేజీకి అడుగు ఎత్తున మాత్రమే నీటి మట్టం ఉంది. దీంతో ఈ ఏడాది పంపా ఆయకట్టులోని 12 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగు సజావుగా సాగుతుందా లేదా అనే అయోమయంలో రైతులు ఉన్నారు. వ్యవసాయ బోర్లు ఉన్నచోట రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతుండగా 'పంపా' నీటితో సేద్యం చేసే రైతులు మాత్రం ఇంకా సందిగ్ధంలోనే ఉన్నారు.

వర్షాలకు కొద్దిగా చేరిన నీరు

వారం క్రితం వరకూ అడుగంటిన నీటి నిల్వలతో, పైకి కనిపించిన మట్టి దిబ్బలతో వెలవెలబోయిన పంపా రిజర్వాయర్ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కొంతమేర 'జలకళ' సంతరించుకుంది. రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాల కారణంగా పంపాలోకి వర్షం నీరు వచ్చి చేరుతోంది. దీంతో రిజర్వాయర్ నీటిమట్టం మంగళవారం 86.8 అడుగులకు చేరింది. ఇంకా వర్షపు నీరు వచ్చి చేరుతుండడంతో నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని రిజర్వాయర్ అధికారులు తెలిపారు.

పంపా రిజర్వాయర్ కింద 12,500 ఎకరాలకు నీరు


తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 12,500 ఎకరాలకు అన్నవరంలోని పంపా రిజర్వాయర్ ద్వారా సాగునీరందుతోంది. వాస్తవానికి ఏటా జూలై నాటికే రిజర్వాయర్ నీటిమట్టం 95 అడుగులకు చేరేది. అటువంటిది ఈ ఏడాది జూలై రెండో తేదీ నాటికి 86.8 అడుగులకు మాత్రమే చేరడంతో భారీ వర్షాలు కురిస్తే తప్ప 95 అడుగులకు చేరుకునే అవకాశం లేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. గత ఐదేళ్లలో ఖరీఫ్‌కు ఏటా ఆగస్టు మొదటి వారంలో, రబీ సాగుకు డిసెంబర్‌లో నీటిని విడుదల చేయడం ఆనవాయితీగా వస్తోంది. గత ఏడాది అయితే ఖరీఫ్ కోసం జూలై ఒకటో తేదీనే నీరు విడుదల చేశారు. తగినంత నీరు లేకపోవడంతో ఈ ఏడాది ఆగస్టులో ఖరీఫ్‌నకు నీటి విడుదల చేసే అవకాశం ఉంది.

మూడుసార్లు నిండితేనే ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు

ఈ రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 105 అడుగులు. రిజర్వాయర్ పూర్తిగా నిండితే 0.5 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. మూడుసార్లు నిండితే తప్ప ఆయకట్టు కింద ఖరీఫ్ గట్టెక్కదు. అయితే నాలుగేళ్లుగా ఖరీఫ్ పంట కాలంలో గోదావరి నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే పుష్కర నీరు పంపాకు విడుదలవుతోంది. దీంతో ఆయకట్టు గట్టెక్కుతోంది. అయితే ఈ ఏడాది గోదావరిలో తగినంత నీరు లేకపోవడంతో పుష్కర నీరు విడుదలపై కూడా సందిగ్ధత నెలకొంది.

కాల్వల్లో పూడిక మేట

పంపా కాల్వలలో చాలాచోట్ల పూడిక పేరుకు పోయింది. దీనికితోడు మెయిన్ కెనాల్‌లో చెట్టు కొమ్మలు విరిగి పడిపోయాయి. వాటిని తొలగించక పోతే నీరు విడుదల చేసినపుడు నీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.



పంపా మెయిన్ కెనాల్‌లో అడ్డుగా పడిన చెట్టు కొమ్మ



పంపా స్లూయిజ్ వద్ద 86.8 అడుగుల నీటిమట్టం

నీటిమట్టం 92 అడుగులు దాటితేనే ఆయకట్టుకు విడుదల




పంపా రిజర్వాయర్ నీటిమట్టం 92 అడుగులు దాటిన తరువాత మాత్రమే ఆయకట్టుకు నీరు విడుదల చేస్తాం. ప్రస్తుతం 86.8 అడుగులు నీటి మట్టం ఉంది. గతేడాది జూలై ఒకటిన పంపా ఆయకట్టుకు నీరు విడుదల చేశాం. ఈ ఏడాది పంపా క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా వర్షాలు కురిసి నీటిమట్టం 92 అడుగులకు చేరుకుంటుందని భావిస్తున్నాం. పంపా బ్యారేజీ గేట్ల మరమ్మతులు కూడా వేగంగా జరుగుతున్నాయి. మొత్తం ఐదు బ్యారేజీ గేట్లలో మూడింటి మరమ్మతులు పూర్తయ్యాయి. రెండు, నాలుగో నంబర్ గేట్ల మరమ్మతులు జరుగుతున్నాయి. వారం రోజులలో అవి పూర్తవుతాయి. ఈలోపు భారీ వర్షాలు కురిసి గేట్ల వద్దకు నీరు వస్తే స్లూయిజ్ గేట్లు ఎత్తి నీటిని మెయిన్ కెనాల్ ద్వారా విడుదల చేస్తాం.

– శేషగిరిరావు, ఈఈ, జలవనరుల శాఖ

6 నుంచి తలుపులమ్మ ఆషాఢ మాసోత్సవాలు

పర్వదినాలలో ప్రత్యేక పూజలు, అలంకరణలు



లోవలో కొలువైఉన్న తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు ఈ నెల ఆరవ తేదీ నుంచి ఆగస్టు ఐదు వరకు జరపనున్నట్టు దేవదాయ ఉప కమిషనర్, లోవ దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు బుధవారం తెలిపారు. గంధామావాస్యను పురస్కరించుకుని లోవ కొత్తూరు గ్రామంలో అమ్మవారి పుట్టింటి సంబరాలు, ఆషాఢంలో లోవ దేవస్థానంలో మాసోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఆషాఢ మాసోత్సవాల సందర్భంగా నిత్య పూజలు నిర్వహించి, అమ్మవారిని విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. పర్వదినాలలో ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేస్తామన్నారు. అందులో భాగంగా ఈ నెల ఏడో తేదీన వివిధ రకాల మట్టి గాజులతో అమ్మవారిని విశేషంగా అలంకరిస్తామన్నారు. 14న అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. 15న జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా పంచామృతాభిషేకాలు చేస్తామన్నారు. 17న తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గణపతి అభిషేకం, గరిక పూజ, గణపతి హోమం, అమ్మవారికి లక్ష తులసి పూజ నిర్వహించనున్నట్టు తెలిపారు. 21న వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరిస్తామన్నారు. పౌర్ణమి సందర్భంగా మహా చండీ హోమం నిర్వహిస్తామన్నారు. 28న అమ్మవారికి విశేష పూల అలంకరణ, లక్ష పుష్పార్చన, 31న ఏకాదశి సందర్భంగా గణపతి అభిషేకం, గరిక పూజ, గణపతి హోమం, అమ్మవారికి లక్ష బిల్వార్చన ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టు మూడవ తేదీన సాయంత్రం సప్తనదీ జలాలతో ఘటాభిషేకానికి అర్చకులు, వేద పండితులతో ఆవహన పూజలు జరుగుతాయన్నారు. నాలుగో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ఘటాభిషేకం నిర్వహిస్తామన్నారు. దీంతో ఆషాఢ మాసోత్సవాలు పూర్తవుతాయని, వేలాది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ధర్మాన్ని కాపాడండి.. అదే రక్షిస్తుంది



వేంకటేశ్వర వైభవంపై ప్రసంగిస్తున్న కోటేశ్వరరావు

మామిడికుదురు: ధర్మాన్ని కాపాడండి.. అదే మిమ్మల్ని రక్షిస్తుంది అని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ఉద్బోధించారు. అప్పనపల్లి బాల బాలాజీ స్వామి సన్నిధిలో బుధవారం వేంకటేశ్వర వైభవం అనే అంశంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ కలియుగంలో డబ్బు సంపాదనే ప్రధాన ధ్యేయంగా మారిందని, చేసేదంతా ధర్మం అనుకుంటూ మానవుడు అధర్మం వైపు పయనిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు చేసిన పాపాల నుంచి విముక్తి పొందేందుకు నిలువు దోపిడీ ఇస్తున్నారన్నారు. కలి బాధను మాపడం కోసం కలియుగంలో వేంకటేశ్వరస్వామిగా అవతారం ఎత్తారని చెప్పారు. అప్పనపల్లిలో రెండు రూపాల్లో బాల బాలాజీ సాక్ష్యాత్కరించారని కోటేశ్వరరావు పేర్కొన్నారు. అన్నదానంలో ప్రపథమ క్షేత్రంగా అప్పనపల్లి గుర్తింపు పొందడం ముదావహమన్నారు. వేంకటేశ్వరస్వామి భక్తులకు ముక్తిని ప్రసాదించడం కోసం ఆపాద మస్తకంగా దర్శనమిస్తున్నారని చెప్పారు. కాగా.. స్వామి వారి ఆలయానికి వచ్చిన కోటేశ్వరరావుకు ఆలయ ఈఓ గ్రంధి మాధవి ఆధ్వర్యంలో అర్చకులు, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన బాల బాలాజీ స్వామిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం అర్చకుల నుంచి వేదాశీర్వచనం అందుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి రావడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

కూటమి నాయకుల మధ్య కుమ్ములాటలు

అయినవిల్లి: కూటమి నాయకుల మధ్య కుమ్ములాటలు మొదలయ్యాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడిలో బుధవారం జరిగిన ప్రోటోకాల్ రగడ నాయకుల మధ్య విభేదాలకు నిదర్శనంగా నిలిచింది. తొత్తరమూడిలోని జీఎంసీ కాలనీకి చెందిన బుడగజంగా కుల పెద్దలు.. కూటమి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ఆహ్వానించారు. తమ ఇబ్బందులను కూడా తెలియజేయాలనుకున్నారు. అయితే ప్రొటోకాల్ పాటించలేదని కూటమిలోని టీడీపీ, జనసేన నాయకులు వాగ్వాదానికి దిగారు. టీడీపీ నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆ పార్టీ నాయకులను మాత్రమే సమావేశాలకు పిలుస్తున్నారని జనసేన పార్టీ నియోజక వర్గ సమన్వయ కర్త మద్దాల చంటిబాబు మండి పడ్డారు. తమ పార్టీ నాయకులు కూటమిలో భాగస్తులు కాదా అని ప్రశ్నించారు. దీంతో సుబ్రహ్మణ్యేశ్వరరావు, చంటిబాబు మధ్య వాగ్వ్వాదం జరిగింది. ఎమ్మెల్యే గిడ్డి సర్ది చెప్పారు.



వాగ్వాదానికి దిగిన టీడీపీ, జనసేన నాయకులు

పంట రుణాల పరిమితి ఖరారు

- బ్యాంకులకు చేరిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదిక
- వరికి రూ.42 వేల నుంచి రూ. 46 వేల వరకూ అప్పు
- కాకినాడ జిల్లాలో 2. 50 లక్షల రైతులకు ఉపయోగం



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆరుగాలం శ్రమించి పండించే రైతన్నకు బ్యాంకులు ఆర్థికంగా దన్నుగా నిలువనున్నాయి. పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలకు అనుగుణంగా రైతులకు భారీగా రుణాలు ఇవ్వనున్నాయి. జిల్లాలో వరి సాగుచేసుకొనే రైతులకు బ్యాంకులు అందించే రుణాలు భారీగా పెంచాయి. రైతులకు ఇచ్చే పంట రుణాల పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారయ్యింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదిక ఇప్పటికే బ్యాంకులకు చేరింది. పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా సహకార బ్యాంకు టెక్నికల్ కమిటీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించి. ఈ నివేదిక రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపింది. దానిని సవరించి ఆమోదించి జిల్లాకు పంపారు. గత మార్చి నెలలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారైనప్పటికీ ఎన్నికల కోడ్ ఉండడంతో కలెక్టర్ ఆమోదించలేదు. ఎన్నికల కోడ్ జూన్ మొదటి వారంలో ముగియడంతో కలెక్టర్ ఆమోదించారు. జిల్లా సహకార బ్యాంకు సీఈఓ ఆర్‌వీ నరసింహారావు, లీడ్‌బ్యాంక్ మేనేజర్ ద్వారా అన్ని బ్యాంకులకు పంపారు. ఈ ఏడాది స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ బ్యాంకులకు చేరడంలో ఆలస్యం కావడంతో పంట రుణాల పంపిణీ కాస్త ఆలస్యమయ్యింది. దీంతో రుణాలు రెన్యువల్ చేయడంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు చేసుకొనేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ తరుణంలో పెంచిన విధంగా రైతులకు రుణాలు అందిస్తే రైతులు బయట అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకొనే పరిస్థితి ఉండదు. ఈ విషయంలో డీసీసీబీతోపాటు వ్యవసాయశాఖ అధికారులు చొరవ తీసుకొని పెరిగిన రుణ పరిమితి ప్రకారం రైతులకు రుణాలు అందించే ఏర్పాట్లు చేయాలి.

పంట పేరు	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (ఎకరాకు, రూపాయిల్లో)
వరి	42,000- 46,000
శ్రీవరి	32,000- 35,000
జొన్నలు	21,000- 23,000
రాగి	16,000- 20,000
మొక్కజొన్న	42,000- 45,000
కందులు	20,000- 24,000
మినుములు	20,000- 22,000
ఆయిల్‌పామ్	60,000- 75,000
ప్రత్తి	44,000- 50,000
మల్బరీసాగు	1,00,000- 1,10,000
పచ్చిమిర్చి	90,000- 95,000
చెరకు	90,000- 1,00,000
పొగాకు	90,000- 1,00,000
టమాట	55,000- 60,000
వంకాయ	40,000- 50,000
బెండకాయ	27,000- 33,000
ఉల్లిపాయలు	55,000- 60,000
అరటి	92,000- 1,00,000
బొప్పాయి	1,00,000- 1,10,000
మామిడి	45,000- 50,000
జీడితోటలు	36,000- 42,000
కొబ్బరి	48,000- 55,000
చేపలసాగు	4,30,000- 4,80,000
రొయ్యలసాగు	3,40,000- 3,60,000

రుణాల వ్యయం పెంపు ఎంతో ఉపయోగం



వరి సాగు చేసేందుకు పెట్టుబడి ఎక్కువగా అవసరం ఉంటుంది. గతంలో బ్యాంకుల్లో ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకూ ఇచ్చేవారు. దీంతో ఆ రుణం సరిపోకపోవడంతో బయట అధిక వడ్డీలకు రుణాలు తీసుకొచ్చేవాళ్లం . ప్రస్తుతం రుణ పరిమితి పెంచడంతో రైతులు బయట అప్పులు తెచ్చుకోవాల్సిన అవసరం ఉండదు.

– కోలా గంగరాజు, రైతు, మాధవపట్నం, సామర్లకోట మండలం

ఈ ఖరీఫ్ నుంచే అమలు



స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కమిటీ నివేదిక ఆధారం పెంచిన రుణ పరిమితి ఈ ఏడాది ఖరీఫ్ నుంచి అమలు చేసే విధంగా చర్యలు తీసుకొంటున్నాం. ఇప్పటికే డీసీసీబీలోని అన్ని శాఖల్లో పెంచిన విధంగానే రుణాలు ఇస్తున్నాం. రుణ పరిమితి పెరడంతో రైతులు కూడా రుణాలు తీసుకొనేందుకు ఆసక్తి చూపుతున్నారు, – ఆర్‌వీ నరసింహారావు, డీసీసీబీ సీఈఓ.

ఆణిముత్యాలపై నీలినీడలు

- జగన్ ప్రభుత్వంలో ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- ఏటా జూన్‌లోనే ఘనంగా కార్యక్రమం
- ఈ సారి స్పందించని చంద్రబాబు ప్రభుత్వం
- నిరాశలో ఉత్తమ విద్యార్థులు

కొత్తపేట: ప్రతి విద్యార్థికీ ప్రోత్సాహం అనేది ఎంతో బలాన్ని ఇస్తుంది. మరిన్ని విజయాలు సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. వారు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు సాయపడుతుంది. ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆణిముత్యాలు పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించారు. రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత ఏడాది జూన్‌లోనే అన్ని స్థాయిల్లో ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందాయి. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని విస్మరించింది. ప్రస్తుతం జూలై ప్రారంభమైనా ఆ విషయం గురించి ఆలోచించడం లేదు.

విద్యార్థులకు ప్రోత్సాహం

విద్యారంగానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని గత ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ, మరోవైపు ప్రతిభ చాటిన విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహించింది. ఆ క్రమంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో పోటీతత్వం పెంచడంతో పాటు మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలనే గొప్ప ఆశయంతో జగనన్న ఆణిముత్యాలు పేరిట విద్యార్థుల ప్రోత్సాహక పథకానికి శ్రీకారం చుట్టింది. పాఠశాల స్థాయి నుంచి నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ విద్యార్థులను గుర్తించింది. వారిని నగదు ప్రోత్సాహకాలతో సత్కరించింది.

నగదు బహుమతులు

రాష్ట్ర స్థాయిలో టెన్త్ టాపర్‌గా నిలచిన వారికి రూ.లక్ష, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 50 వేల చొప్పున గత జగన్ ప్రభుత్వం అందించింది. జిల్లా స్థాయిలో టెన్త్ టాపర్లకు రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.15 వేలు చొప్పున, నియోజక వర్గ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున, పాఠశాల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున అందజేసింది. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కూడా ఘనంగా సత్కరించింది.

విద్యార్థులకు సత్కారం

గత ఏడాది అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 42 మంది పదో తరగతి విద్యార్థులకు, 35 మంది ఇంటర్ విద్యార్థులకు నగదుతో పాటు షీల్డ్, మెడల్ అందచేసి సత్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 51 మంది జిల్లా స్థాయిలో, 70 మంది నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించారు. వారిని జిల్లా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు నగదు ప్రోత్సాహకాలతో సత్కరించారు.

నిరాశలో ఈ ఏడాది టాపర్లు

ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో ఆణిముత్యాలు పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత ప్రభుత్వం సదుద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకంపై ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. విద్యాశాఖాధికారులను అడిగినా తమకూ ఏ విధమైన స్పష్టత లేదంటున్నారు. దీంతో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. గత ఏడాది మాదిరిగానే నగదు ప్రోత్సాహకాలు అందజేయాలని కోరుతున్నారు.



విజయవాడలో ఉత్తమ విద్యార్థులతో మాజీ సీఎం జగన్, మంత్రులు (ఫైల్)

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

గండేపల్లి: వివాహిత అదృశ్యంపై బుధవారం గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం..పెదపూడి మండలం గండ్రేడు గ్రామానికి చెందిన సుంకర రామకృష్ణ, అతడి భార్య భవాని మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మే ఆరో తేదీన రామకృష్ణ తన భార్యను గండేపల్లిలోని అత్తవారి ఇంటి వద్ద వదిలి పెట్టాడు. అనంతరం మే 8వ తేదీన భవాని తన రెండేళ్ల కుమారుడిని ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం వెతుకుతున్నప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో రామకృష్ణ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వచ్చే నెల 31తో ముగియనున్న స్కాలర్‌షిప్ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో 2023 డిసెంబర్‌లో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపిక అయిన విద్యార్థులు ఆగస్టు 31వ తేదీ లోపు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు బుధవారం తెలిపారు. 2020, 2021, 2022 సంవత్సరాలలో ఎంపిక అయిన విద్యార్థులు రెన్యువల్ చేసుకోవాలన్నారు. మార్పులు చేసిన హోమ్ పేజీ, కొత్త మొబైల్ యాప్, వెబ్ వెర్షన్‌తో కూడిన వన్ టైమ్ రిజిస్ట్రేషన్ అప్లికేషన్ స్కాలర్‌షిప్స్.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఈ ఏడాది వన్‌టైమ్ పాస్‌వర్డ్ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. వివరాలలో ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా మెరిట్ లిస్ట్‌లోను, ఆధార్‌లో ఉండేవిధంగా సరిచూసుకుని పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మెరిట్ లిస్ట్‌లో ఉన్న విధంగానే ఆధార్ కార్డ్ పైన వివరాలు లేని విద్యార్థులు వెంటనే ఆధార్, బ్యాంక్ పాస్ బుక్‌లలో వాటిని సరిచేయించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తన బ్యాంక్ ఖాతాను ఆధార్ నంబర్‌కు సీడ్ చేయించుకొని డీబీటీ ద్వారా డబ్బు జమ అయ్యేవిధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో స్కాలర్‌షిప్ జమ కాదన్నారు. దీనికి విద్యార్థి తల్లిదండ్రులు, సంబంధిత పాఠశాల వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ప్రతిభ ఉంటే.. ప్రోత్సాహం మీవెంటే..

- బాల శాస్త్రవేత్తలకు బంగారు అవకాశం
- ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల రూపకల్పనకు ఆహ్వానం
- ఈ నెల ఒకటి నుంచి ప్రారంభమైన నమోదు

రాయవరం: విద్యార్థుల చిట్టి బుర్రలలో అనేక సృజనాత్మక అంశాలు దాగి ఉంటాయి. తాము ఉంటున్న పరిసరాలు, నేర్చుకున్న విషయాలు, చూసిన సమస్యలకు పరిష్కార మార్గాలను కనిపెడుతూ ఉంటారు. అలాగే వివిధ విషయాలపై వారికున్న అవగాహన కూడా కొత్త ఆవిష్కరణలకు దారి చూపుతుంది. అయితే వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఒక వేదిక కావాలి. ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ వేడుక వారికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతోంది.

ఏటా ప్రతిష్ఠాత్మకంగా..

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ సరికొత్త వేదికను రూపొందించారు. దీనిలో అన్ని ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా 2024 – 25 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు విద్యార్థుల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు. దీని కోసం 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు తరగతికి ఒకరు వంతున పాఠశాలకు ఐదు ప్రాజెక్టులను నమోదు చేసుకునే అవకాశముంది. 2008 – 09 నుంచి ఏటా నిర్వహించే ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ మేనేజ్‌మెంట్ల పాఠశాలల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు.

ప్రాజెక్టులను పంపండిలా..

www.inspireawards&dst.gov.in వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా ఆగస్టు 30వ తేదీలోపు పాఠశాల విద్యార్థులు వారి ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు వీలుగా రూ.10 వేల పారితోషకం అందిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25 వేల వరకూ తమ ప్రాజెక్టును మెరుగుపర్చుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులు కేటాయిస్తుంది. ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన అవకాశాలతో పాటు ఇంజినీరింగ్ కళాశాల విద్యలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశం కూడా ఉంది. పూర్తి వివరాలకు ఆయా జిల్లాల సైన్స్ అధికారులకు ఫోన్ చేసి సంప్రదించవచ్చు.



గతేడాది జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

దరఖాస్తు చేసుకునే విధానం

తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను పరిష్కరించేలా ఐడియా ఉండాలి. తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, ఆలోచనకు అవసరమైన ప్రాజెక్టును రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి వివరాలు నమోదు చేయాలి. విద్యార్థికి సంబంధించిన బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ నంబరు ఎంటర్ చేయాలి. విద్యార్థి ప్రాజెక్టు సంక్షిప్తంగా, రాత పూర్వకంగా పొందుపర్చి, సంబంధిత రైటప్ వెబ్‌సైట్‌లో ఎంటర్ చేయాలి. ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టుల ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయికి ఎంపికకు పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టుకు ప్రయోగ నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 30వ తేదీ వరకూ గడువు ఉంది.



ఉమ్మడి జిల్లాలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల పరిధిలో గత విద్యా సంవత్సరంలో 2,145 పాఠశాలల నుంచి 4,168 ప్రాజెక్టులు నమోదయ్యాయి. **2022 – 23 విద్యా సంవత్సరంతో పోలిస్తే 2023 – 24 విద్యా సంవత్సరంలో 138 ప్రాజెక్టులు పెరిగాయి. ఉమ్మడి జిల్లాలలో ప్రాజెక్టులు తగ్గగా, కోనసీమ జిల్లాలో 132** పెరిగాయి. అయితే ప్రాజెక్టుల ఎంపికలో మాత్రం వెనుకబడి ఉండడం గమనార్హం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 379 ప్రాజెక్టులు ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికయ్యాయి. వాటిలో తూర్పుగోదావరి జిల్లాలో 78, కాకినాడ జిల్లాలో 170, కోనసీమ జిల్లాలో 131 ఉన్నాయి. ఎంపికైన ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థుల ఖాతాలో ఈ ఏడాది జనవరి నెలాఖరుకు ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున ప్రాజెక్టు రూపకల్పనకు సొమ్ములు జమ చేశారు.

నాణ్యత లోపిస్తోందా!

ఉమ్మడి జిల్లాలో అత్యధిక ప్రాజెక్టులు రిజిస్టర్ అయినప్పటికీ ప్రాజెక్టుల రూపకల్పనలో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయని, అందువల్లనే ఎంపికయ్యే ప్రాజెక్టుల సంఖ్య తక్కువగా ఉంటోందనే విమర్శలున్నాయి. ప్రాజెక్టులో సృజనాత్మకత, నాణ్యత లోపించడంతో దీనికి కారణంగా తెలుస్తుంది. 2024 – 25 విద్యా సంవత్సరానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 74 ప్రాథమికోన్నత, 236 ప్రభుత్వ, 170 ప్రైవేటు ప్రాథమికోన్నత, 157 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి కనీసం మూడు, ఉన్నత పాఠశాలల నుంచి కనీసం ఐదు ప్రాజెక్టులు రూపొందించాలి.

త్వరలో ఓరియంటేషన్ తరగతులు



ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టుల రూపకల్పనపై త్వరలోనే సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తాం. విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుని బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇది చక్కటి అవకాశం. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలకు పదును పెడితే, ఉత్తమ ప్రాజెక్టులు ఆవిష్కృతమవుతాయి.
– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

చక్కని అవకాశం



విద్యార్థులు తమలోని సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించేందుకు ఇన్‌స్పైర్ మనాక్ ఒక చక్కని అవకాశం. ఈ పోటీలో విద్యార్థులందరూ పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలి. జిల్లా నుంచి అత్యధికంగా నామినేషన్లు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌లో గొప్ప శాస్త్రవేత్తలను కలుసుకునే అవకాశం లభిస్తుంది.
– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

సైన్స్ ఉపాధ్యాయులు కీలకం



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేసేలా ప్రోత్సహించాలి. ఈ అద్భుతమైన అవకాశాన్ని అందిపుచ్చుకునేలా వారిని తీర్చిదిద్దాలి. ముఖ్యంగా సైన్స్ ఉపాధ్యాయులు ఎక్కువ బాధ్యత తీసుకోవాలి. రాష్ట్ర స్థాయిలో పోటీ పడేలా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి.
– గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

లక్ష్య స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ వందన బోహ్రా

బాలాజీచెరువు (కాకినాడ): లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌కు స్వామి వివేకానంద ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఏక్ ఉపదేశ్ మీడియా ఆధ్వర్యంలో పాఠశాలల ప్రగతి, విద్యా పనితీరు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డు అందజేశారు. సుమారు ఐదు వందల పాఠశాలలు పాల్గొనగా కాకినాడ లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌కు ఈ గౌరవం దక్కింది. పాఠశాల ప్రిన్సిపాల్ వందన బోహ్రాకు అవార్డును హైదరాబాద్‌లో సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా వందన బోహ్రాను విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ సుగుణారెడ్డి అభినందించారు.

రూ.40 లక్షల గోల్‌మాల్‌పై అధికారుల స్పందన

సాక్షి ఇంపాక్ట్

రాజానగరం: జి.యర్రంపాలెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో రూ.40 లక్షలు గోల్‌మాల్ జరిగిందని 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు శాఖలో బిజినెస్ కరస్పాండెంట్ నానిబాబుపై పోలీసులకు ఫిర్యాదు చేశామని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డీవీ ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు ఇచ్చిన ఫిర్యాదుపై కూడా విచారణ జరిపి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు. బీసీని నియమించిన నోడల్ ఏజెన్సీ ఈ విషయంలో పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. కాగా.. ఈ గోల్‌మాల్‌పై తమ శాఖాపరంగా విచారణ చేపడతామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. జరిగిన లావాదేవీలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపేందుకు డీఆర్‌డీఏ అధికారి జనార్దనరావును నియమించామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



సూరిబాబు (ఫైల్)

తాళ్లరేవు/యానాం: తాళ్లరేవు మండల పరిధిలోని గోవలంక గ్రామ పంచాయతీ సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ భర్త సూరిబాబు మరొక వ్యక్తికి సాయం చేసే క్రమంలో ప్రమాదవశాత్తూ మృతి చెందారు. సూరిబాబు (జాన్‌బాబు) గల్ఫ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన బుధవారం యానాం నుంచి తన స్వగ్రామమైన గోవలంకకు ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా గోదావరి ఏటిగట్టు రహదారిలో కనకాలపేట వద్ద ఒక ట్రాక్టర్ ఆగి ఉండడాన్ని గమనించాడు. తన గ్రామానికి చెందిన ట్రాక్టర్ కావడంతో డ్రైవర్ నూకరాజుతో మాట్లాడాడు. కూలీలకు భోజనాలు తెచ్చేందుకు బైక్ కావాలని సూరిబాబును అడిగాడు. అడిగిందే తడవుగా సూరిబాబు బైక్ తాళాలు అతనికి ఇచ్చి ట్రాక్టర్‌పై కుర్చుని ఫోన్ మాట్లాడుతున్నాడు. అదే సమయంలో యానాం నుంచి జేసీబీని తరలిస్తున్న లారీ ట్రాక్టర్‌ను బలంగా ఢీకొంది. దీంతో గేర్‌లో ఉన్న ట్రాక్టర్ అకస్మాత్తుగా స్టార్ట్ అయ్యి ముందుకు కదలడంతో సూరిబాబు ఒక్కసారిగా క్రింద పడ్డారు. ట్రాక్టర్ టైర్ కింద నలిగిపోయిన సూరిబాబు (58) అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై యానాం పోలీసులు కేసు నమోదు చేశారు.

రాజమహేంద్రవరంలో 'బుజ్జి' సందడి




ప్రభాస్ నటించిన కల్కి 2898ఏడీ సినిమాలోని బుజ్జి వాహనం రాజమహేంద్రవరంలో సందడి చేసింది. స్థానిక ఆనం కళాకేంద్రం ఆవరణలోని సుబ్రహ్మణ్య మైదానంలో బుధవారం దీన్ని ప్రదర్శనకు ఉంచారు. ముందుగా బుజ్జి వాహనాన్ని గీతా ఫిలిమ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. బుజ్జిని చూసేందుకు అభిమానాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దర్శకుడు నాగ్ అశ్విన్ కొత్త ఆలోచనతో మహీంద్రా కంపెనీ సహకారంతో ఈ బుజ్జి వెహికల్‌ను సుమారు రూ.6 కోట్లతో పెట్టి తయారుచేశారు. సినిమాలో బుజ్జి చేసే యాక్షన్ సీన్స్ అందరినీ మెప్పించాయి.
– ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):

తెలుగు తమ్ముళ్ల ఇసుక దోపిడీ



పులిదిండిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు



ధ్వంసమైన ఏటిగట్టు

- పులిదిండిలో అనధికార ర్యాంపు
- రాత్రి పగలూ లారీలలో తరలింపు
- పట్టించుకోని అధికారులు

ఆత్రేయపురం: కొత్తపేట నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు ఇసుక దోపిడీకి తెరలేపారు. ఇందుకోసం ఆత్రేయపురం మండలం పులిదిండిలో వారం రోజుల క్రితమే దర్జాగా ఇసుక ర్యాంపును ఏర్పాటు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలు తుంగలో తొక్కి, ఒక యువనేత అండదండలతో ర్యాంపు నిర్వహిస్తున్నారు. పగలూ రాత్రి నిరంతరాయంగా వందల లారీల ఇసుకను తరలిస్తూ కోట్లాది రూపాయాల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు. ర్యాంపు కోసం ప్రత్యేకంగా బాటలు కూడా నిర్మించారు. మూడు జేసీబీల సాయంతో వశిష్ఠ నదీపాయలో తవ్వకాలు జరుపుతున్నారు. ఆరు యూనిట్ల కెపాసిటీ కలిగిన లోడు లారీలు పగలు ఆత్రేయపురం, అంకంపాలెం మీదుగా, అలాగే రాత్రి లొల్ల లాకులు, ధవళేశ్వరం బ్యారేజీ అడ్డదారిలో రాకపోకలు సాగిస్తున్నాయి. లొల్ల లాకుల వద్ద భారీ వాహనాల రాకపోకలు నిషేధిస్తూ గతంలోనే హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి, ఇరిగేషన్ అధికారులు కాపలా పెట్టారు. అయితే ప్రస్తుతం అధికార పార్టీ నాయకులకు భయపడి పట్టించుకోవడం లేదు.

అంతర్జాతీయ పోటీలలో రాణించాలి

కాకినాడ రూరల్: ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ క్రీడాకారుడిగా జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణిస్తున్న కాకినాడకు చెందిన మందపల్లి శ్రీనివాసరావును మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అభినందించారు. మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. శ్రీనివాసరావు ఇటీవల నేపాల్‌లో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 9వ ఇంటర్నేషనల్ గేమ్స్ – 2024లో అథ్లెటిక్స్ విభాగానికి సంబంధించి డిస్కస్ త్రోలో మొదటి స్థానం, పవర్ లిఫ్టింగ్ 105 కేజీల విభాగంలో మొదటి స్థానం సాధించాడు. అలాగే బాడీ బిల్డింగ్ పోటీలలో అనేక బహుమతులు అందుకున్నాడు. సింగపూర్, మలేషియాలలో సెప్టెంబర్‌లో జరగనున్న పవర్ లిఫ్టింగ్ పోటీలకు హాజరుకానున్నాడు. ఈ సందర్భంగా రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో కన్నబాబును బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కన్నబాబు మాట్లాడుతూ ఐదేళ్లలో శ్రీనివాసరావును ఎంతగానో ప్రోత్సహించామని, ఆయన ప్రతిభతో రాణిస్తూ సింగపూర్‌లో పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న మాజీ మంత్రి కన్నబాబు

ఆగమ పాఠశాల విద్యార్థులకు డయేరియా



డయేరియా సోకిన విద్యార్థులకు సెలైన్లు ఎక్కిస్తున్న వైద్య సిబ్బంది



విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సిబ్బంది

- వెంటనే స్పందించిన అన్నవరం దేవస్థానం అధికారులు
- ఎనిమిది మందికి చికిత్స
- కోలుకొంటున్న విద్యార్థులు

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం నిర్వహిస్తున్న సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులకు బుధవారం డయేరియా సోకింది. దేవస్థానం వైద్య సిబ్బంది ఆ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించారు విజయవాడ దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్.. విద్యార్థులకు డయేరియా సోకిన విషయం తెలిసి వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈఓ ఆదేశాలతో డిప్యూటీ ఈఓ రమేష్ బాబు ఆగమ పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చికిత్స అందిస్తున్న దేవస్థానం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌తో మాట్లాడి, విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులు కోలుకుంటున్నారని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని ఆయన తెలిపారు.

పది ఎకరాల విస్తీర్ణంలో..

సత్యగిరిపై సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాల నడుస్తోంది. ప్రాచీన గురుకులాల మోడల్‌లో అత్యాధునిక వసతులతో నిర్మించిన ఈ పాఠశాలను 2022 ఆగస్టు 13వ తేదీన అప్పటి దేవదాయ ధర్మదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఇక్కడ విద్యార్థులకు స్మార్త, ఆగమ శాస్త్రాలను అధ్యాపకుడు ఆరాధ్యుల లక్ష్మీనృశింహాశర్మ బోధిస్తున్నారు. దేవస్థానం వేదపండితులు ప్రత్యేక పర్యవేక్షకులుగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ హోమాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు యాగశాలతో బాటు ప్రత్యేక భవనంలో వంటశాల కూడా ఉంది. ప్రస్తుతం 36 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

విద్యార్థులకు చికిత్స

అధ్యాపకుడు ఆరాధ్యుల లక్ష్మీ నృశింహ శర్మ బుధవారం ఉదయం యథావిధిగా పాఠం బోధిస్తుండగా కొందరు విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ ఈఓ డీవీఎల్ రమేష్ బాబు దేవస్థానం ఆసుపత్రి వైద్య సిబ్బందికి ఫోన్ చేయడంతో వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, ఇతర సిబ్బంది ఆగమ పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురికి బీపీ తక్కువగా ఉండడంతో వెంటనే వారికి సులైన్లు ఎక్కించి ఇంజెక్షన్లు చేశారు మరో ఇద్దరు విద్యార్థులు కూడా అస్వస్థతగా ఉందని చెప్పడంతో వారికి కూడా వైద్యం చేసి, సెలైన్ ఎక్కించారు. కాగా..వాతావరణం మార్పుల వలనే ఆగమ పాఠశాల విద్యార్థులకు డయేరియా సోకిందని దేవస్థానం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. కాగా.. డయేరియా బారిన పడిన విద్యార్థులను శివసదన్‌లోని ఏసీ గదులకు తరలించి అక్కడ వైద్యం అందిస్తున్నారు. మిగిలిన విద్యార్థులను కూడా తాత్కాలికంగా శివసదన్ సత్రంలో గదులకు తరలించారు.